
డెంగ్యూ డేంజర్ బెల్స్



నగరంలో డెంగ్యూ జ్వర పీడితుల సంఖ్య **రోజురోజుకు పెరుగుతోంది.** ఇతర సీజనల్ వ్యాధులు కూడా వేగం**గా విస్తరిస్తున్నాయి.** డెంగ్యూ జ్వరం రోగిలో ప్లేట్‌లెట్స్ క్షణక్ష**ణానికి తగ్గిపోతాయి.** వాతావరణంలో మార్పు వల్ల, అపారిశు**ధ్యం పేరుకుపో**వడం వల్ల దోమలు వృద్ధి చెంది అనేక **రోగాలకు** కారణమవుతున్నాయి. అవగాహన, ము**ందు జాగ్ర**త్తలతో సీజనల్ వ్యాధులను నివారించవ**చ్చు.** ఈ విషయంలో వైద్య సిబ్బంది సూచనల**ను** పాటిస్తే చక్కటి ఫలితం ఉంటుంది.

- **అంతకంతకూ పెరుగుతున్న కేసులు**
- **రోగులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు**
- **అపరిశుభ్ర వాతావరణమే కారణమంటున్న వైద్యులు**

మహారాణిపేట: డెంగ్యూ వ్యాధి లక్షణాలు పలు రకాలుగా ఉంటాయి. హఠాత్తుగా తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కంటి రెప్పల కదలికలు తగ్గడం, కదిలించినప్పుడు భరించలేని నొప్పి, ఒళ్లు నొప్పులతో కూడిన జ్వరం, చలి జ్వరం, కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులు, ఆకలి మందగించడం, చర్మంపై ఎర్రని దద్దుర్లు, నాడి నెమ్మదిగా కొట్టుకోవడం, రక్తపోటు పడిపోవడం, ఒక్కోమారు శరీరంలోని వివిధ రంధ్రాల ద్వారా రక్తస్రావం జరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అటువంటి వ్యక్తులు దగ్గరలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, సామాజిక ఆరోగ్య కేంద్రానికి లేదా ఏదైనా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలి. పరీక్షలో డెంగ్యూ పాజిటివ్ అని తేలితే రక్త నమూనాను ఆంధ్రా మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న మైక్రో బయాలజీ సెంటర్‌కు పంపుతారు. అక్కడ మాక్ ఎలిశా టెస్టు నిర్వహించి వ్యాధి నిర్ధారిస్తారు.



ఇందిరాకాలనీలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మలేరియా అధికారి తులసి (ఫైల్)



పూర్ణామార్కెట్‌లోని పళ్ల దుకాణాల వద్ద గల కాలువల్లో నిలిచిపోయిన మురుగునీరు



రామకృష్ణా రైతుబజార్ ప్రాంతంలో దుర్గంధభరితంగా మారిన రహదారులు



మురుగు నీటిలో దోమలు

పేరుకుపోతున్న చెత్త..

నియోజకవర్గంలోని దొండపర్తి, లలితానగర్, పూర్ణామార్కెట్ వెనుకభాగం, వెలంపేట, ఐటీ సంస్థ, ప్రసాద్‌గార్డెన్స్, రెల్లివీధి, పంజా జంక్షన్, అల్లిపురం, రామకృష్ణా జంక్షన్, రామకృష్ణా రైతుబజార్, రెల్లివీధి తదితర ప్రాంతాలు చెత్తకు నిలయంగా మారాయి.

ఈ ప్రాంతాల్లో ఒకటి రెండు రోజులు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టకపోతే చెత్తమయంగా మారుతోంది. నివాస ప్రాంతాలు ఇలా ఉంటే డెంగ్యూ ప్రమాదం పొంచి ఉన్నట్లే.

ఆరోగ్యశ్రీలో ఉచిత వైద్యం..

అనేక ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద డెంగ్యూకు ఉచిత సేవలందిస్తున్నారు. జనరల్ మెడిసిన్ చికిత్స అందుబాటులో ఉండే ఆస్పత్రుల్లో డెంగ్యూ కేసుల చికిత్స ఉచితంగా ఇస్తున్నట్టు ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ అప్పారావు తెలిపారు. డెంగ్యూతో బాధపడుతున్న వారు ఎవరైనా తమను సంప్రదించాలని ఆయన తెలిపారు.



కేజీహెచ్ భావనగర్ వార్డులో కిటకిటలాడుతున్న జ్వరపీడితులు

దోమలే కారణం..

దోమల వల్ల వచ్చే వ్యాధుల్లో డెంగ్యూ జ్వరం ఒకటి. ఇతర జ్వరాల కన్నా డెంగ్యూ జ్వరం చాలా ప్రమాదకరం. డెంగ్యూ జ్వరం ఫ్లూ వంటి లక్షణాలు కలిగి ఉంటుంది. 2–7 రోజులుంటుంది. దోమ కాటు తర్వాత 4 నుంచి 10 రోజుల తర్వాత జ్వరం వస్తుంది. డెంగ్యూ, తీవ్రమైన డెంగ్యూ అనేది దోమల వల్ల కలిగే వైరల్ ఇన్ఫెక్షన్. మామూలు డెంగ్యూ అయితే జ్వరం ఉంటుంది.

తీవ్రమైన డెంగ్యూ అయితే ప్రాణాంతకమని తెలుసుకోవాలి. ఈ ఏడాది జనవరి ఒకటవ తేదీ నుంచి ఆగస్టు ఒకటో తేదీ వరకు 3,452 మందికి డెంగ్యూ పరీక్షలు చేయగా 267 మందికి డెంగ్యూ నిర్ధారణ జరిగింది. 1,39,126 మందికి మలేరియా పరీక్షలు నిర్వహించగా 100 కేసులు నమోదు అయ్యాయి.

భయపడాల్సిన అవసరం లేదు..



డెంగ్యూ వ్యాధికి ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. చికిత్స కోసం కేజీహెచ్‌కు రావచ్చు. ప్రస్తుతం కేజీ హెచ్‌లో డెంగ్యూ బాధితులకు చికిత్స అందుతోంది. భావనగర్ వార్డులో వీరి కోసం ప్రత్యేకంగా కొన్ని మంచాలు సిద్ధం చేశాం. డెంగ్యూ కోసం ఆరు పడకలు, మలేరియా కోసం ఆరు పడకలు కేటాయించాం. రోజు ఓపీకి 10 నుంచి 20 మంది జ్వర పీడితులు వస్తున్నారు. ఇందులో 5 నుంచి 10 వరకు డెంగ్యూ కేసులుంటున్నాయి.

– డాక్టర్ పి.శివానంద్,
కేజీహెచ్ సూపరింటెండెంట్

అవగాహన కల్పిస్తున్నాం..



డెంగ్యూ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఈ వ్యాధి గురించి వివరిస్తున్నాం. అలాగే నివాస ప్రాంతాల్లో కూడా ప్రజలకు ఈ వ్యాధి గురించి వివరిస్తూ.. తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కూడా చెబుతున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు పలు శాఖల అధికారుల సమన్వయంతో సదస్సులు నిర్వహిస్తున్నాం.

–ఎం.తులసి, మలేరియా అధికారి,
విశాఖ జిల్లా

క్లుప్తంగా

కొనసాగుతున్న శ్రావణలక్ష్మి పూజలు



శ్రావణమాస పూజల్లో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

డాబాగార్డెన్స్: శ్రావణమాసం సందర్భంగా కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు ఆదివారం 7వ రోజుకి చేరాయి. ఈ సందర్భంగా అమ్మవారికి విశేషపూజలు చేశారు. వేదమంత్రాలు, నాదస్వర సుస్వరాల మధ్య ఉదయం 8.10 గంటలకు శ్రావణ లక్ష్మి పూజలు ప్రారంభించారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అంధులకు అన్నదానం



అంధులకు అన్నదానం చేస్తున్న కొండా రాజీవ్‌గాంధీ

డాబాగార్డెన్స్: అంధులకు సేవ చేయడంలో తృప్తి ఉందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండా రాజీవ్‌గాంధీ అన్నారు. స్వామి వివేకానంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పలువురు అంధులకు అన్నదానం చేశారు. అనంతరం ఒక్కొక్కరికి 5 కేజీలు చొప్పున బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా రాజీవ్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల వారిని గుర్తించి మనం ఆదుకోవాలని అన్నారు. వారికి సేవలందించడమే కాక అన్నదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు పాల్గొన్నారు.

‘వీరాభిమన్యు’ చిత్రానికి 60 ఏళ్లు

డాబాగార్డెన్స్: తెలుగు ప్రజల అందాల కథానాయకుడు, సోగ్గాడు శోభన్‌బాబు తొలిసారి టైటిల్ రోల్ పోషించిన చిత్రం ‘వీరాభిమన్యు’ 60 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో పుస్తకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్, సిటీ వైడ్ శోభన్‌బాబు అభిమానులు కనకరాజు, రమణ, శోభన్‌బాబు, నాగరాజు, త్రిమూర్తులు, బి.కుమార్, బొట్టా ప్రసాద్, రమణ, అప్పలరాజు, దనపల్లా ప్రసాద్, హరిప్రసాద్, అప్పారావు, కొణతాల చిన్నా, నందవరపు సోములు, భానోజీరావు, జగన్, అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం అభినందనీయం



కళాకారులకు పురస్కారాలు అందిస్తున్న అతిథులు

సీతమ్మధార: తెలుగు రాష్ట్రాల్లో వేర్వేరు రంగాలకు చెందిన 39 మంది ప్రతిభావంతులను గుర్తించి వారికి పురస్కారాలు అందజేయడం అభినందనీయమని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రతిభ, క్రీడా, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పలువురు కళాకారులకు అతిథుల చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డు స్వీకరించిన ప్రతి ఒక్కరూ భవిష్యత్తులో మరింతగా సేవలు అందించాలని ఆకాంక్షించారు. రెండు దశాబ్దాలకు పైగా క్రమం తప్పకుండా పురస్కారాలు అందిస్తున్న నిర్వాహకుడు అడవిరాజును అతిథులు ప్రశంసించారు. లక్ష్మీ స్వరూప వ్యాఖ్యానం చేశారు.

చిన్నారులకు చెస్ పోటీలు



చెస్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

అల్లిపురం: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా వెంకటేశ్వరమెట్ట, శ్రీ గౌరీ సేవా సంఘం, శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు చెస్ పోటీలు నిర్వహించారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న పిల్లలకు నిర్వహించిన చదరంగం పోటీలకు 33వ వార్డులో గల అన్ని స్కూళ్ల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. విజేతలకు ఈ నెల 15వ తేదీన జరిగే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదే విధంగా ఆగస్టు 15వ తేదీన మరిన్ని క్రీడలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ కార్యవర్గ సభ్యులు తెలిపారు.

14న మిగులు సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్

సబ్బవరం: అనకాపల్లి, విశాఖ జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఉమ్మడి జిల్లా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల సమన్వయకర్త ఎస్.రూపవతి తెలిపారు. విశాఖ జిల్లా పరిధిలోని 3, అనకాపల్లి జిల్లా పరిధిలోని 5 గురుకులాల్లో 5వ తరగతితో పాటు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 14న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. 5వ తరగతి ప్రవేశం కోసం 4వ తరగతి స్టడీ సర్టిఫికెట్, ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇంటర్మీడియట్ ప్రవేశం కోసం పదో తరగతి ఉత్తీర్ణత పత్రం, ఆధార్, కుల, ఆదాయ ధ్రువపత్రాలతో అనకాపల్లి జిల్లా తాళ్లపాలెంలోని గురుకులంలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 0891–2799641 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



వ్యర్థాలనూ వదలడం లేదు..

జ్ఞానాపురంలోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ దగ్గర కనిపించిన ఈ దృశ్యాలు చూస్తే.. చెత్త నుంచి సంపద సృష్టి ఇలానా. అనక మానరేమో! హోల్‌సేల్ వ్యాపారం జరిగిన తర్వాత కుళ్లిపోయిన.. పాడైపోయిన కూరగాయలు, ఆకుకూరలు బయట ఉన్న ఫ్లైఓవర్ కింద పారబోస్తారు. వాటిని చుట్టుపక్కల ఉన్న పశువులు తినేందుకు వస్తాయి. అయితే.. కొందరు వచ్చి ఆ మూగజీవాలను అక్కడి నుంచి తరిమేసి.. అందులో కాస్త శుభ్రంగా ఉన్న కూరగాయలను వేరు చేస్తున్నారు. వాటిని శుభ్రంగా కడిగి కుళ్లిపోయిన భాగాన్ని కోసి.. హోటళ్లు, రెస్టారెంట్లకు విక్రయించేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పశువుల నోటికాడ కూడుని లాగేసుకుంటున్నారు.

ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



ఉత్సాహంగా జిల్లా స్థాయి నడక పోటీలు



నడక పోటీల్లో పాల్గొన్న వాకర్లు

కంచరపాలెం: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో త్రీస్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు వి.రాంబాబు ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి నడక పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులు డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ టి.రంగారావు, ఫౌండర్ సూర్యనారాయణ జెండా ఊపి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ నడకతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం నడకకు కొంత సమయం కేటాయించాలని సూచించారు. జిల్లా స్థాయిలో 4 కేటగిరీల్లో 135 మంది మహిళలు, పురుషులు నడక పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. విజేతలకు ఆగస్టు 15న జరిగే వేడుకల్లో బహుమతులు అందజేస్తామని కార్యదర్శి బలరామ్ తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి వెంకటరావు, జాయింట్ కార్యదర్శి ఇమ్మానియేల్, జాలీ వాకర్ రవీంద్ర బెహరా, బులెటిన్ ఎడిటర్ సత్యనారాయణ, డిప్యూటీ గవర్నర్ అప్పలనాయుడు, వాకర్లు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

మహారాణిపేట: మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఇవ్వాల్సిన రూ. 10 వేలు తక్షణం అందజేయాలని రాష్ట్ర మర పడవల సంఘం మాజీ అధ్యక్షుడు పీసీ అప్పారావు కోరారు. ఈ మేరకు ఆయన నాయకత్వంలో పలువురు మత్స్యకారులు ఆదివారం అమరావతిలో మంత్రి కొల్లు రవీంద్రను కలిసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను అప్పారావు ఈ సందర్భంగా మంత్రితో ప్రస్తావించారు. తుపాను, ఇతర కారణాల వల్ల సముద్రంలో మునిగిపోయిన బోట్లకు నష్టపరిహారం తక్షణం ఇవ్వాలని కోరారు. అనంతరం మంత్రిని సత్కరించారు.

జూలో చిత్రలేఖనం పోటీలు



తాము గీసిన చిత్రాలతో విద్యార్థులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో ఆదివారం చిత్రలేఖనం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ నెల 12న అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జూ బయోస్కోప్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభించిన పోటీల్లో నగరంలోని ప్రభుత్వ పాఠశాలలతోపాటు వివిధ స్కూళ్లకు చెందిన 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారి ప్రతిభకు పదును పెట్టి ఏనుగులు, పర్యావరణానికి సంబంధించిన చిత్రాలు వేశారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా మాట్లాడుతూ ఏనుగులపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పిల్లలను పోటీలకు ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జూ డిప్యూటీ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(డీసీఎఫ్) జి.మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలనాయుడు, సెక్షన్ ఆఫీసర్లు భారతి, రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.

సేఫ్టీ కోర్సులపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సురేష్

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో సేఫ్టీ కోర్సుల ప్రాధాన్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అమర్ రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్(తిరుపతి) సేఫ్టీ డిపార్ట్‌మెంట్ హెడ్ ఆర్‌ఎస్‌ఎన్‌ఆర్ సురేష్ పాల్గొని విద్యార్థులకు సేఫ్టీ విభాగంలోని పలు అంశాలను వివరించారు. విపత్తుల గుర్తింపు, వాటి నివారణ మార్గాలను తెలియజేశారు. కార్యక్రమంలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ సేఫ్టీ విభాగం సీనియర్ మేనేజర్ మాధవ్‌కుమార్, కాలేజీ సేఫ్టీ కోర్సుల కో ఆర్డినేటర్ వరహాలు పాల్గొన్నారు.

వెలమలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి



మాట్లాడుతున్న లగుడు గోవిందరావు

డాబాగార్డెన్స్: త్వరలో కేటాయించనున్న నామినేటెడ్ పోస్టుల్లో వెలమలకు ప్రాధాన్యం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వెలమ సామాజిక వర్గానికి తీరని అన్యాయం జరుగుతోందన్నారు. దశాబ్దాలుగా బీసీ–డి జాబితాలో ఉన్న వెలమ కులాన్ని బీసీ–ఎ జాబితాలో చేర్చాలని కోరారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో వెలమ భవనాల ఏర్పాటుకు స్థలాలు కేటాయించాలని, వెలమ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, వెలమ రైతులకు శతశాతం సబ్సిడీతో రుణాలు అందజేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులతో భేటీ కానున్నట్టు చెప్పారు. సమావేశంలో పెదిరెడ్ల సత్యం, పెదిరెడ్ల శ్రీనివాసరావు, పైడం నాయుడు, రెడ్డి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కలిసి నడుద్దాం.. ఆరోగ్యంగా జీవిద్దాం

మురళీనగర్: వాకర్స్ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అందరం కలిసి నడుద్దామని వాకర్స్ ఇంటర్నేషనల్ సెక్రటరీ జనరల్ సీలం ఐజాక్ పిలుపునిచ్చారు. వాకర్స్ డిస్ట్రిక్ట్–101 ఎలక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్–101 పరిధిలోని వాకర్స్ క్లబ్‌ల ప్రధాన బాధ్యులతో మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్స్ పార్కు వనితా భవన్‌లో ఆదివారం నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనలో భాగంగా నడక ప్రాధాన్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వాకర్స్ క్లబ్ సభ్యులకు గురుతర బాధ్యత ఉందన్నారు. వాకర్స్ చెల్లించే సభ్యత్వ రుసుమును సేవా కార్యక్రమాలకే ఉపయోగిస్తున్నామని చెప్పారు. మహాత్మా గాంధీ ఫెలోషిప్ సభ్యత్వాలను వీలైనంత ఎక్కువగా సేకరించాలన్నారు. మరో ముఖ్య అతిథి రాళ్లపల్లి సత్యనాథం మాట్లాడుతూ వాకర్స్ క్లబ్ కార్యవర్గ ప్రతినిధులు తమ క్లబ్‌లోని సభ్యులను సమన్వయపరిచి సేవా కార్యక్రమాలను విస్తృత పరచాలని సూచించారు. డిస్ట్రిక్ట్–101 గవర్నర్ టి.రంగారావు, పూర్వ గవర్నర్ ఉప్పలపాటి శుభతోపాటు విశాఖ, అనకాపల్లి జిల్లాల నుంచి 55 మంది వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పొందూరు ప్రభావతి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- డిస్ట్రిక్ట్–101 క్యాబినెట్ కార్యవర్గ ప్రధాన బాధ్యులను ద్వారకానాథ్ నామినేట్ చేశారు. వీరందరూ 2025 సంవత్సరానికి ఎలక్ట్ గవర్నర్ ద్వారకానాథ్‌తో కలిసి పనిచేస్తారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులను సత్కరించారు.

‘రైతుబజార్ ఏర్పాటుకు కృషి చేస్తాం’



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

సీతమ్మధార : దక్షిణ నియోజకవర్గంలో రైతుబజార్ ఏర్పాటుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. సీతంపేట దరి రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన జనసేన పార్టీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆశయాల సాధనకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి విజయం సాధిస్తాడని ధీమా వ్యక్తం చేశారు. విశాఖ ఆర్థిక రాజధానిగా అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. సినీ దర్శకుడు మెహర్ రమేష్ మాట్లాడుతూ ముంబై, చెన్నై మాదిరిగా సముద్రం ఉన్న విశాఖలో సినీ పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని, కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని పేర్కొన్నారు. కార్పొరేటర్లు భీశెట్టి వసంతలక్ష్మి, సాధిక్, జనసేన ఉత్తర ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, సీనియర్ నాయకుడు శివప్రసాద్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ బి.ఉమామహేశ్వరరావు, బీజేపీ నాయకుడు జి.అప్పారావు జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శాకాహార సద్భావన ర్యాలీ

పెదగంట్యాడ: బ్రహ్మర్షి పితామహ పత్రీజీ ఆశయాలకు అనుగుణంగా అహింసా పిరమిడ్ స్పిరిట్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవలు చేయడం అభినందనీయమని 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు అన్నారు. ధ్యాన కేంద్రం ప్రతినిధి మీసాల శివ గణేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం శాకాహార సద్భావన ర్యాలీని నడుపూరు జంక్షన్ నుంచి అన్ని వీధుల మీదుగా నిర్వహించారు.